సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



గ్రామాల అభివృద్ధే లక్ష్యం
గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - 9లో



డెస్క్ బెంచీల వితరణ
జిబ్లక్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు దాస్‌సేవా సమితి రూ.4 లక్షల విలువైన డెస్క్ బెంచీలు బహూకరించింది. - 9లో



మెడ క్యాన్సర్‌పై అవగాహన
బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో మెడ క్యాన్సర్ శస్త్రచికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. - 9లో



భళా.. నృత్యకళ

భువనగిరి: భువనగిరి మండలం రాయగిరిలోని మినీ శిల్పారామంలో శనివారం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కల్యాణి, సర్వసుది బృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఎంతగానో అలరించింది. యాదగిరీశుడి సన్నిధికి వచ్చిన భక్తులు తిరుగుపయనంలో మినీ శిల్పారామాన్ని సందర్శించి సాంస్కృతిక ప్రదర్శలను వీక్షించారు. చెరువులో బోటుపై షికారు చేశారు.



పవిత్రోత్సవాలకు గుట్ట క్షేత్రం ముస్తాబు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రధానాలయ దివ్య విమాన స్వర్ణగోపురం వద్ద పూజలు నిర్వహించి, సుదర్శన చక్రానికి పవిత్ర మాలలు వేయనున్నారు. ఇందుకు వీలుగా గోపురానికి పరంజా ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిత్య, శాశ్వతకల్యాణం, సుదర్శన హోమం, లక్షపుష్పార్చన, బ్రహ్మోత్సవం తదితర భక్తులచే జరిపించే పూజలు రద్దు చేసినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.

పవిత్రోత్సవాల సందర్భంగా పూజలు నిర్వహించేందుకు ప్రధానాలయ విమాన స్వర్ణగోపురానికి ఏర్పాటు చేసిన పరంజా



పదిలంగా స్నేహబంధం

- స్నేహానికి కల్మషం లేదంటున్న యువత
- అమ్మ తరువాత స్థానంలో స్నేహితుడు, నాన్న

సాక్షి ప్రతినిధి, నల్లగొండ:

సుఖ దుఃఖాల్లో, కష్ట సుఖాల్లో వెన్నంటి ఉంటూ తాను తోడున్నాననే భరోసా ఇచ్చేవాడే స్నేహితుడు. అన్ని సమయాల్లో నిస్వార్థంతో ఉండే అనురాగబంధమే స్నేహం. అందుకే స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం.. అన్నాడో సినీ కవి. ఆధునిక పోకడలు మనిషి జీవితాన్ని మార్చేసిన ప్రస్తుత పరిస్థితుల్లోనూ స్నేహానికి ఉన్న స్థానం అలాగే పదిలంగా ఉంది. మనిషిలో ఎన్ని మార్పులొచ్చినా స్నేహానికి ఉన్న విలువ ఏ మాత్రం తగ్గలేదు. అయితే మనుషులు కలుషితం అయ్యారే తప్ప స్నేహానికి ఉన్న స్థానం గొప్పదనే చెబుతోంది నేటి యువత. అలాంటి మనుషుల వల్ల కొంతవరకు స్నేహం కలుషితం అయింది తప్ప, స్నేహం అనేది కల్మషం లేనిదంటూ స్పష్టం చేశారు. ఈనెల 3వ తేదీన స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన సర్వేలోనూ ఇదే విషయం స్పష్టమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గానికి 100 మందిని 'సాక్షి' పలకరించింది. అందులో ప్రతి ఒక్కరూ తమ దృష్టిలో స్నేహం కల్మషం లేనిదని చెప్పుకొచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1200 మందితో సర్వే నిర్వహించగా, అందులో 72.42 శాతం మంది ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. 27.58 శాతం అవసరాలు తీర్చేదిగా స్నేహం మారిందని పేర్కొన్నారు. మనుషుల స్వార్థం కారణంగా స్నేహం కూడా కలుషితం అయిందని 57.08 శాతం మంది వెల్లడించగా, కలుషితం కాలేదని 42.92 శాతం మంది తెలిపారు. తమకు ఒక్కరే స్నేహితులు ఉన్నారని 37.50 శాతం మంది పేర్కొనగా, తమకు ఇద్దరికంటే ఎక్కువ మంది స్నేహితులు ఉన్నారని 62.50 శాతం మంది స్పష్టం చేశారు. స్నేహితునికి ఇచ్చే స్థానం విషయంలోనూ అమ్మ, నాన్న కంటే ముందుగా స్నేహితునికే మొదటి స్థానం ఇస్తామని 21.42 శాతం మంది స్పష్టం చేశారు. 62.25 శాతం మంది.. అమ్మకే మొదటి స్థానాన్ని ఇవ్వగా, రెండో స్థానాన్ని స్నేహితునికి ఇచ్చారు. 16.33 శాతం మంది మాత్రం మొదటి స్థానం నాన్నకు ఇవ్వగా, ఆ తరువాత అమ్మ, స్నేహితునికే ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు.

ఇవీ సర్వే వివరాలు..



స్నేహమేరా జీవితం ప్రత్యేక కథనాలు 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి: హైదరాబాద్‌లోని బేగంపేట, రామాంతపూర్‌లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి 2025–26 విద్యా సంవత్సరానికి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు గిరిజన శాఖ జిల్లా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 2018 జూన్ – 2019 మే 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించరాదన్నారు. ఈ నెల 8 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని.. ఆధార్, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను జతపర్చాలన్నారు. ఈనెల 12న కలెక్టరేట్‌లో డ్రా విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9849704132 ను సంప్రదించాలని కోరారు.

నేత్రపర్వంగా నృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: పంచ నారసింహుడు కొలువైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనల్లో భాగంగా ఉత్సవ మూర్తుల నిత్యకల్యాణ వేడుకను అర్చకులు ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రభాత వేళ స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజావాహన సేవ, స్వామి, అమ్మవారికి కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం వేళ వెండిజోడు సేవను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు.

డీఆర్‌ఓగా జయమ్మ

సాక్షి యాదాద్రి: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)గా ఎం.జయమ్మను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లాకు బదిలీ చేశారు. కొంత కాలంగా డీఆర్‌ఓ పోస్ట్ ఖాళీగా ఉంది.

51% సాగు

2,29,671 ఎకరాల్లో వివిధ పంటలు

- వర్షాభావంతో తగ్గిన సాగు విస్తీర్ణం
- సాధారణం కంటే 2,29,666 ఎకరాలు తక్కువ
- గణనీయంగా పడిపోయిన వరి, అదే బాటలో పత్తి



బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో పూర్తయిన వరి నాట్లు

సాక్షి, యాదాద్రి: వర్షాభావ పరిస్థితుల కారణంగా వానాకాలం పంటల సాగు విస్తీర్ణం తక్కువగా ఉంది. సాధారణ సాగు విస్తీర్ణం 4.50 లక్షల ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 2,29,671 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. సీజన్ మొదలై రెండు నెలలు గడిచినా లోటు వర్షపాతమే నమోదైంది. సరైన వర్షాలు లేక చాలామంది రైతులు సాగుబాట పట్టకుండా మిన్నకున్నారు.

వరి 1.31 లక్షల ఎకరాల్లోనే..

వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం వరి సాగు 2,36,168 ఎకరాలు కాగా.. 1,31,174 ఎకరాల్లో నాట్లు వేశారు. అది కూడా మూసీ పరీవాహక మండలాలైన భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, రామన్నపేట మండలాల్లో అధికంగా నాట్లు పడ్డాయి. నాన్ ఆయకట్టులో 30 శాతం కూడా నాట్లు వేయలేదు.

వరి బాటలోనే పత్తి

వర్షాధార పంటలైన పత్తి, కంది సాగు గణనీయంగా తగ్గింది. 1.15 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అంచనా వేయగా 98,121 ఎకరాలకు మించలేదు. కంది 6 వేల ఎకరాలు అంచనా వేయగా.. కేవలం 376 ఎకరాల్లోనే సాగు చేశారు. ఇతర మెట్ట పంటలు మచ్చుకైనా కనిపించడం లేదు.

లోటు వర్షపాతం

సీజన్ ప్రారంభంలో మురిపించిన వర్షాలు.. ఆ తరువాత జాడలేకుండా పోయాయి. జూన్ చివరి వారంలో, జూలై మొదటి వారంలో మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో సాగు పుంజుకుంటున్న తరుణంలో మళ్లీ వరుణుడు ముఖం చాటేయడంతో సాగు డీలా పడింది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 99.2 మి.మీ కాగా.. 56.5 మి.మీ కురిసింది. సాధారణం కన్నా 42 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. జూలైలో 236.5 మి.మీటర్లకు గాను 228.6 మి.మీ కురిసింది. 3 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

లోతుల్లోకి భూగర్భ జలం

వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు పడిపోయాయి. గత సంవత్సరం జూలై నెలాఖరులో 10.90 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలం.. ఈ ఏడాది జూలై 11.87 మీటర్ల లోతుకు వెళ్లింది. నారాయణపురం, ఆత్మకూర్ మండలాల్లో దయనీయ పరిస్థితులున్నాయి.

చెరువులు వెలవెల

జిల్లాలో ఆయకట్టు ఉన్న చెరువులు 158 ఉన్నాయి. ఇందులో మూసీ పరీవాహక చెరువులు మాత్రమే నిండాయి. భువనగిరి నియోజకవర్గంలో 17, ఆలేరులో 2 చెరువులు అలుగుపోశాయి. 63 చెరువులు 25 శాతం, 22 చెరువులు 50 శాతం, 16 చెరువులు 45 శాతం, 24 చెరువులు వంద శాతం నిండాయి.



వట్టిపోయిన చాడ గ్రామ చెరువు

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



ముల్కలపల్లిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్

తుర్కపల్లి: మండలంలోని ముల్కలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శనివారం కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణ సామగ్రి ధరలపై అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీ లెంకల గీతారెడ్డి, హౌసింగ్ ఏఈ సంతోష్, పంచాయతీ కార్యదర్శి కూరెళ్ల నాగరాజు ఉన్నారు.

నృసింహుడి ఆలయ భూముల సర్వే



యాదగిరిగుట్ట ఆలయ భూముల సర్వేను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ భూముల పరిరక్షణపై అధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సంయుక్తంగా శనివారం డీజీపీఎస్ (డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సర్వే చేపట్టారు. స్వామివారికి యాదగిరిగుట్ట పట్టణంతో పాటు పాతగుట్ట, వైటీడీఏ పరిధిలోని టెంపుల్ సిటీ, మల్లాపురం, రాయగిరి, దాతరుపల్లి, సైదాపురం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూములు ఉన్నాయి. వీటన్నింటినీ సర్వే చూసి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. నాలుగు రోజుల పాటు కొనసాగనుందని తెలిపారు. సర్వేలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కరశర్మ, తహసీల్దార్ గణేష్, దేవస్థానం, మున్సిపల్ అధికారులు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

యాప్‌లో తప్పుడు హాజరు నమోదు

- తొమ్మిది మంది గ్రామ పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్
- ఒక ఔట్‌సోర్సింగ్ కార్యదర్శి, ఆరుగురు ఎంపీఓలకు నోటీసులు

సాక్షి యాదాద్రి: విధులకు రాకుండానే హాజరైనట్లు కొద్ది రోజులుగా డీఎస్‌ఆర్ యాప్‌లో అటెండెన్స్ వేసుకుంటున్న తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడంతో పాటు ఒక ఔట్ సోర్సింగ్ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అదే విధంగా కార్యదర్శుల పనితీరును పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం వహించిన ఆరుగురు ఎంపీఓలకు సైతం కలెక్టర్ హనుమంతరావు శనివారం నోటీసులు జారీ చేశారు.

వివరాలిలా..

గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజూ విధులకు రాగానే డైలీ శానిటేషన్ రిపోర్ట్ (డీఎస్‌ఆర్) యాప్‌లో అటెండెన్స్ వేయాలి. కానీ, కార్యదర్శులు తమ సెల్‌ఫోన్ గ్యాలరీలో ఉన్న ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసి హాజరు నమోదు చేస్తున్నారు. కమిషనరేట్ నుంచి నిఘా పెట్టిన ఉన్నతాధికారులు.. సదరు కార్యదర్శులను పట్టుకున్నారు. ఈ మేరకు వారిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో టి.ఆనంద్(సింగారం), ఎండీ అబ్దుల్ ఖదీర్ (తుర్కపల్లి), ఎస్.వెంకటేశ్ (పల్లివాడ), పి.సతీష్‌కుమార్ (నాగారం), డి.రామకృష్ణ (ఎల్లంబావి), బి.యాదగిరి (దాచారం), ఎండీ ఇస్మాయిల్ (వస్తాకొండూర్), టి.సైదులు (అంబాల), పి.గంగరాములు (పల్లగట్టుతండా) సస్పెన్షన్‌కు గురయ్యారు.

ఎంపీఓలు వీరే..

పద్మావతి, రవూఫ్, అంజిరెడ్డి, పి.జనార్దన్‌రెడ్డి, సలీం, నరసింహారావు ఉన్నారు.

టీఎన్‌జీఓ ఖండన

పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడాన్ని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ (టీఎన్జీఓ)జిల్లా కమిటీ ఖండించింది. కలెక్టర్ పునరాలోచన చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధరణికోట భగత్ ఒక ప్రకటనలో కోరారు. ముందస్తుగా షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడమేనన్నారు. కార్యదర్శుల సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే టీఎన్జీఓ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం తదుపరి కార్యాచరణకు దిగుతామన్నారు. ఖండించిన వారిలో టీఎన్జీఓ నాయకులు భగత్, ఖదీర్, శ్రీకాంత్, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు శశికాంత్ ఉన్నారు.



తండాల్లో తీజ్ పండుగ

మొదలైన మొలకల పండుగ సందడి

- తీజ్ వేడుకల్లో తొమ్మిదిరోజుల పాటు నియమ నిష్టలు
- ఆటపాటలతో సందడి చేయనున్న గిరిజన యువతులు
- చివరి రోజు గోధుమ బుట్టల నిమజ్జనంతో వేడుకల ముగింపు
- ఇటీవల ముగిసిన సీత్లా పండుగ

బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే ముఖ్యమైన పండుగల్లో తీజ్ (మొలకల పండుగ) ఒకటి. ముఖ్యంగా పెళ్లికాని గిరిజన యువతులు తొమ్మిది రోజుల పాటు జరుపుకునే తీజ్ వేడుకలు తెలంగాణలోని బతుకమ్మ పండుగను పోలి ఉంటాయి. ప్రతి సంవత్సరం ఆషాఢ, శ్రావణ మాసాల్లో గిరిజన యువతులు ఎక్కడ ఉన్నా తండాలకు చేరుకొని తమకు మంచి భర్త రావాలని తీజ్ వేడుకలు చేసుకుంటారు. గిరిజన యువతులు విద్య, ఉద్యోగ, సంసారిక జీవితంతో పాటు పుట్టినిల్లు, మెట్టినిల్లు కూడా అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో తులతూగాలని ఏటా ఈ పండుగను నిర్వహిస్తారు.



పులియోగెనో ప్రత్యేకం..

గిరిజనుల సంప్రదాయం, సంస్కృతికి పులియోగెనో అతి ముఖ్యమైనది. దీనిని బంజార మహిళలు స్వయంగా తయారు చేస్తారు. అద్దాలు, గవ్వలు, పూసలతో చూడముచ్చటగా తయారు చేయడానికి తమ స్తోమతను బట్టి ఖర్చు చేస్తారు. గోధుమలు మొలకెత్తడానికి నీటిని పోసే సమయంలో తీజ్ ఉత్సవం నిర్వహించేటప్పుడు దీనిని వినియోగిస్తారు. యువతులు కలశాలతో నీటిని తీసుకొచ్చేటప్పుడు తలపై పెట్టుకొనే దానిని గెనో అని ఆ రెండు కలశాలపై కప్పుకొని వచ్చేదానిని పులియా అని వ్యవహరిస్తారు. పెళ్లి సమయంలో దీనిని పెళ్లికూతురుకు తమ గుర్తుగా తల్లిదండ్రులు అందిస్తారు.

సంతోషంగా జరుపుకుంటాం

తీజ్ ఉత్సవాలను మా తండాలో చాలా సంతోషంగా జరుపుకుంటాం. తీజ్ బుట్టలకు రోజూ నీళ్ల పోస్తూ, భక్తిశ్రద్ధలతో నిష్ఠతో ఉపవాస దీక్షలు చేస్తాం. ఈ తొమ్మిదిరోజులపాటు ఆటాపాటలతో తండా అంతా సందడి వాతావరణం ఉంటుంది. మంచి వరుడు వస్తాడని మా పెద్దలు చెబుతుంటారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మేము కోరుకుంటాం.

– లావుడియా సోనియా, తుర్కపల్లి

ఉపవాసంతో పూజలు చేస్తాం



తీజ్ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు నిష్ఠతో జాగరణలో ఉంటూ పూజలు చేస్తాం. ఉత్సవాలు ముగిసే వరకు తండాను వదిలి బయటికి వెళ్లం. చివరిరోజు పూర్తిగా ఉపవాసంతో ఉంటాం. తండా పెద్దలు, తల్లిదండ్రులు, సోదరుల సహకారంతో భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తాం.

– రమావత్ అనిత, తిరుమలగిరిసాగర్

తండా అంతా ఒక్కటిగా జరుపుకుంటాం



తీజ్ పండుగను తండావాసులంతా కలిసి జరుపుకుంటాం. పంటలు బాగా పండాలని అమ్మవార్లకు పూజలు చేస్తాం. గోధుమ నారును తెంచి కుటుంబ సభ్యులకు ఇచ్చి, అమ్మవారి దీవెనలు అందుకుంటాం. చివరి రోజున చెరువుల్లో నిమజ్జనం చేస్తాం.

– నీలా బాయి, తుర్కపల్లి

తిరుమలగిరి(నాగార్జునసాగర్), యాదగిరిగుట్ట రూరల్ : తండాల్లో తీజ్ సందడి మొదలైంది. తెలంగాణలో జరుపుకునే బతుకమ్మ తరహాలో, గిరిజన తండాల్లో సాగిపోయే ఈ తీజ్ ఉత్సవాలు సంప్రదాయానికి అద్దం పడతాయి. ఆషాఢ మాసంలో సీత్లా పండుగ ముగిశాక.. శ్రావణ మాసంలో పెళ్లి కాని యువతులు భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు తీజ్ పండుగ జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమి నుంచి కృష్ణాష్టమి వరకు తండాల్లో ఈ తీజ్ సంబరాలను ఆనందంగా జరుపుకుంటారు.

తీజ్ నిర్వహిస్తారు ఇలా..

పెళ్లికాని యువతులు రేగిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీజ్ వేడుకలను ప్రారంభిస్తారు. అంతకుముందే తండాల్లోని పెద్దలు ప్రతి ఇంటి నుంచి గోధుమలు సేకరించి రోజంతా నీళ్లలో నానబెడతారు. పెళ్లికాని యువతులు చిన్నచిన్న వెదురు బుట్టల్లో పుట్టమన్ను(మకొడధూడ్) గోవు పిడకల చూర్ణాన్ని కలిపి నాయక్(పూజారి) ఇంటికి తీసుకురాగా నాయక్ భార్య ఆ బుట్టల్లో నానబెట్టిన గోధుమలు వేసి అలుకుతుంది. యువతులు తీజ్ బుట్టలు నింపుతుంటే, వారి అన్నదమ్ముళ్లు ఈ బుట్టలను పెట్టడానికి మంచె వేస్తారు. తీజ్ బుట్టలను మంచెపై, పెట్టి తొమ్మిది రోజుల పాటు, ఉదయం, సాయంత్రం భక్తి శ్రద్ధలతో నీళ్ల పోస్తారు. తీజ్ బుట్ట ఎంత పచ్చగా పెరుగుతుందో అంత మంచి వరుడు వస్తాడని, పంటలు బాగా పండుతాయని గిరిజనుల నమ్మకం. ఏడవ రోజున రొట్టెలను బెల్లంతో కలిపి ముద్దలు చేసి, మేరామా భవానీకి నైవేద్యంగా పెడతారు. ఎనిమిదవ రోజున మట్టితో ఆరాధ్య దేవతల ప్రతిమలను పూజించి వాటికి పెళ్లి జరిపిస్తారు. తొమ్మిదవ రోజున నిమజ్జన ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. యువతులు తీజ్ బుట్టలను మంచెపై నుంచి కిందికి దింపి తలపై పెట్టుకుంటారు. పెద్దల ఆశీర్వాదం తీసుకుని డప్పుచప్పుళ్లతో, సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేసుకుంటూ ఆటపాటలతో చెరువులో నిమజ్జనం చేస్తారు. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత పెద్దమనుషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులను సైతం పీటలపై కూర్చోబెట్టి పెద్దమనుషులు వారి కాళ్లు కడిగి ఆశీర్వదిస్తారు.



ఉప్పు కారం లేని ఆహారం

ఈ తీజ్ ఉత్సవాలు ప్రారంభం రోజు నుంచి, నిమజ్జనం చేసే వరకు తండాల్లోని యువతులు ఉప్పు, కారం లేని ఆహారాన్ని తీసుకుంటూ.. భక్తి శ్రద్ధలతో దీక్షలు చేపడతారు. మాంసాహారాలు ముట్టకుండా, తండా నుంచి బయటికి వెళ్లకుండా, రోజూ బిందెను కింద పెట్టకుండా నీటిని తీసుకొచ్చి తీజ్ పందిరిపై పోస్తారు. రోజంతా తమ పనులు చేసుకుని, సాయంత్రం తీజ్ దగ్గరికి వచ్చి, ఆటా, పాటలతో తొమ్మిది రోజులు పాటు నృత్యం చేస్తారు.

క్లుప్తంగా

సాంకేతిక లోపంతో ఆగిపోయిన ఎలక్ట్రిక్ బస్సు



ఆగిపోయిన ఎలక్ట్రిక్ బస్సు

మోత్కూరు: సూర్యాపేట డిపో నుంచి శనివారం హైదరాబాద్‌కు బయల్దేరిన ఎలక్ట్రిక్ బస్సు మోత్కూరు పట్టణంలోని టీవీఎస్ షోరూం ఎదుట సాంకేతిక లోపంతో గంటన్నర సేపు నిలిచిపోయింది. డ్రైవర్ మరమ్మతుల కోసం ఎంతో శ్రమించినా ఫలితం లేకపోవడంతో డిపో మేనేజర్‌కు సమాచారం అందించారు. బస్సులో సుమారు 35 మంది ప్రయాణికులు ఉండగా.. బస్సు ఆగిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. డ్రైవర్, కండక్టర్ డిపో టెక్నికల్ టీంతో వీడియో కాల్‌తో మాట్లాడగా.. బస్సులోని బ్యాటరీలు, శాటిలైట్ సిగ్నల్స్‌కు సంబంధించిన పరికరాలు హీట్ అవ్వడంతో బస్సు ఆగిపోయిందని తెలిపారు. ఇతర డిపోలకు చెందిన బస్సుల్లో కొంతమందిని ప్రయాణికులు తరలించారు. గంటన్నర తర్వాత బస్సు బయల్దేరడంతో మిగతా ప్రయాణికులు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు వెళ్లారు.

'కిట్స్' చైర్మన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయండి

- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సూర్యాపేట జిల్లా కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు. కోదాడలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు సమయంలో కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్‌గా ఉన్న నీలా సత్యనారాయణ తప్పుడు, ఫోర్జరీ పత్రాలతో ఇతరుల భూమిని తనదిగా చూపి ఢిల్లీలోని ఏఐసీటీఈ, హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలను మోసగించినట్లు ఇటీవల విజిలెన్స్ అలర్ట్ నోటీస్ జారీ చేసింది. కళాశాల ఏర్పాటులో నీలా సత్యనారాయణ పది తప్పిదాలు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేసి వాటిలో తొమ్మిది ఆరోపణలు నిజమని నిర్ధారించి నివేదికను ప్రభుత్వానికి ఇచ్చారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యామండలిని ఆదేశించడంతో ఆ శాఖ కార్యదర్శి.. నీలా సత్యనారాయణతో పాటు తప్పుడు, ఫోర్జరీ పత్రాలను సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

చెస్ ఎగ్జిబిషన్‌కు ఆహ్వానం


కరుణాకర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ప్రపంచ మాజీ చెస్ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్, ఆయన కుమారుడు అఖిల్ ఆనంద్‌తో కలిసి చెన్నైలో ఏర్పాటు చేసిన చెస్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడానికి ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కొనసం కరుణాకర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించే చెస్, కలలు, మ్యాథ్స్ ఎగ్జిబిషన్(మార్పి గెనిసిస్)లో పాల్గొనడానికి కరుణాకర్‌రెడ్డి శనివారం చెన్నై బయల్దేరి వెళ్లారు.

స్నేహమేరా జీవితం



స్నేహితులంటే మన భుజంపై చేయి వేసి నడిచేవాడు కాదు, ఆపద సమయంలో నేనున్నా అని భుజం తట్టి చెప్పేవాడు. స్నేహానికి దీనికి వయసు, హోదాతో సంబంధం ఉండదు. కష్ట నష్టాల్లో తోడుగా ఉంటూ ఎల్లప్పుడూ మన మంచి కోరుకునే వాడే నిజమైన స్నేహితుడు. చదువుకునే రోజుల్లో మొదలైన స్నేహాన్ని ఏ హోదాలో ఉన్నా, ఎక్కడ ఉన్నా దశాబ్దాలు మారుతున్నా కొనసాగించే వారు కొందరైతే.. స్నేహితులంతా కలిసి ఆపదలో ఉన్నవారికి సాయం అందించేవారు కొందరు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా అసలైన స్నేహానికి అద్దం పడుతున్న కొన్ని ప్రత్యేక కథనాలు..

'సిల్వర్ జూబ్లీ' స్నేహం


వల్లపుదాసు సత్యనారాయణ (ముందు), బాలిన వెంకట్‌రావు (వెనుక వ్యక్తి)

నిడమనూరు: ఏపీలోని కర్నూల్ జిల్లాలో గల సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో 2000 సంవత్సరంలో మొదలైన వారిద్దరి స్నేహానికి ఈ ఏడాదితో సిల్వర్ జూబ్లీ(25 వసంతాలు) పూర్తయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన వల్లపుదాసు సత్యనారాయణ, ఏపీలోని ప్రస్తుత ఏలూరు జిల్లా భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన బాలిన వెంకట్‌రావు 2000 సంవత్సరంలో కర్నూల్‌లోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(బయో కెమిస్ట్రీ) చదువుతుండగా స్నేహితులయ్యారు. వీరిద్దరూ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నారు. అనంతరం ఇద్దరూ కలిసి బీఈడీ చేసినప్పటికీ.. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగాలు ప్రారంభించి, ప్రస్తుతం మార్కెటింగ్ జనరల్ మేనేజర్లుగా కొనసాగుతున్నారు. 25 ఏళ్లు అవుతున్నా, వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారైనప్పటికీ ఇప్పటికీ తమ స్నేహాన్ని కొనసాగిస్తూ 'సిల్వర్ జూబ్లీ' జరుపుకుంటున్నారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో అప్పుడప్పుడు కలుసుకుంటూ యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నాడు తండ్రులు.. నేడు కుమారులు


తండ్రులు వీర్లపాటి వెంకటేశ్వర్లు, కందగట్ల వెంకటేశ్వర్లు


పుత్రులు జయదీప్, అభినవ్

నకిరేకల్: నకిరేకల్ పట్టణానికి చెందిన వీర్లపాటి వెంకటేశ్వర్లు, కందగట్ల వెంకటేశ్వర్లు 1980లో నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే నాటి నుంచి వారి మధ్య స్నేహబంధం ఏర్పడింది. నల్లగొండలో ఒకే రూమ్‌లో కలసి ఉంటూ డిగ్రీ, పీజీ చేశారు. వీర్లపాటి వెంకటేశ్వర్లు సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తూ ఇటీవల రిటైర్డ్ అయ్యారు. కందగట్ల వెంకటేశ్వర్లు పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొంది నకిరేకల్‌లోనే లెక్చరర్‌గా, వాసవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. నేడు వారిరువురి కుమారులైన వీర్లపాటి అభినవ్, కందగట్ల జయదీప్‌లు కూడా అత్యంత మిత్రులుగా మారారు. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే కాలం నుంచి ఆప్తులుగా మారారు. చిన్ననాటి నుంచి వారి తండ్రులు స్నేహితులు కావడం, తరుచూ ఆ రెండు కుటుంబాలు కలుసుకుంటూ ఉండడంతో దోస్తానం వారిని ఆప్త మిత్రులుగా మార్చింది. ఆస్ట్రేలియాలో అభినవ్, అమెరికాలో జయదీప్ ఎంఎస్ చదివారు. వారి స్నేహానికి అమెరికాలో యాదృచ్ఛికంగానే ఒకే ఆఫీస్‌లో ఇరువురికి ఉద్యోగం లభించింది. ఇప్పుడు అమెరికాలోని హరిజోన్ రాష్ట్రంలో ఉద్యోగం చేస్తూ స్నేహమేరా జీవితం అంటూ తండ్రుల స్నేహాన్ని వారు పదిలంగా పంచుకుంటూ కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నారు.

అండగా ఉంటున్న 'ఆల్ మై ఫ్రెండ్స్'


స్నేహితుడి కుమార్తె వివాహానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆల్ మై ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు (ఫైల్)

దేవరకొండ: దేవరకొండ జెడ్పీహెచ్‌ఎస్ 1989–90 బ్యాచ్‌కు చెందిన 84మంది పదో తరగతి విద్యార్థులు ఆల్ మై ఫ్రెండ్స్ పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని తమ స్నేహితులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. 2015లో ఏర్పాటు చేసుకున్న ఈ వాట్సాప్ గ్రూప్ ద్వారా తమతో పాటు చదువుకున్న స్నేహితులకు ఆర్థికపరమైన ఇబ్బందులను తొలగించడంతో పాటు ఆపద సమయాల్లో మేమున్నాం అంటూ అండగా నిలుస్తున్నారు. మొదట్లో గ్రూప్ సభ్యులకు మాత్రమే సహాయ సహకారాలు పరిమితం కాగా ప్రస్తుతం వారి సేవలను విస్తృతపర్చారు. గతేడాది తమ స్నేహితుడైన ఆంజనేయులు అనారోగ్యానికి గురికావడంతో మిత్రులంతా కలిసి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. మరో స్నేహితుడు కృష్ణమాచారి అనారోగ్యంతో మృతిచెందడంతో అతని కుటుంబానికి రూ.1.80లక్షలు అందజేశారు. ఇటీవల జరిగిన కర్నాటి ఆంజనేయులు కుమార్తె వివాహానికి రూ.55వేలు అందించి భరోసా కల్పించారు.

ఆపదలో ఆదుకుంటున్న 'మిత్రమండలి'


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రమండలి సభ్యులు (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలో కొంతమంది స్నేహితులు, యువకులు కలిసి మిత్రమండలి పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను 2021లో ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్ ద్వారా స్నేహితులంతా కలిసి ఆపదలో ఉన్న వారికి తమకు తోచిన సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్సాయపల్లి గ్రామానికి చెందిన బాణోతు వీరన్న చెరువులో పడి మృతిచెందగా.. అతడి కుటుంబానికి మిత్రమండలి ఆధ్వర్యంలో రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పందిరి సైదులు కుటుంబానికి రూ.25 వేలు, అకాల మరణం చెందిన అంకిరెడ్డి రవి కుటుంబానికి రూ.30 వేలు, బైక్ పైనుంచి పడి మృతిచెందిన పూజారి సైదులు కుటుంబానికి రూ.27 వేలతో పాటు పలు కుటుంబాలకు మిత్రమండలి ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా బాణోతు సాయి పేదరికంతో చదువు మధ్యలోనే మానేయడంతో అతడికి రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. అంతేకాకుండా సామాజిక అంశాలపై వాట్సాప్ గ్రూప్ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామస్తులను చైతన్యపరుస్తున్నారు. రాజకీయాలకతీతంగా గ్రామస్తుల్లో మార్పు తీసుకురావడానికి మిత్రమండలి వాట్సాప్ గ్రూప్ సభ్యులు కృషిచేస్తున్నారు.

ఐదు దశాబ్దాల దోస్తానా..


కందుకూరి వెంకటేశ్వర్లు


పసుపులేటి జయపండరి

నల్లగొండ టూటౌన్: వారిద్దరిది ఒకే ఊరు. అదే ఊళ్లో ప్రభుత్వ బడిలో చదువుకున్నారు. అనంతరం ఉన్నత చదువులు చదివి ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఒకటో తరగతిలో మొదలైన వారి స్నేహం గత 53 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన కందుకూరి వెంకటేశ్వర్లు, పసుపులేటి జయపండరి ఒకటో తరగతి నుంచి స్నేహితులు. కందుకూరి వెంకటేశ్వర్లు ప్రస్తుతం నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రజారోగ్య ఎస్‌ఈగా పనిచేస్తుండగా.. పసుపులేటి జయపండరి నల్లగొండలోనే ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఎస్‌ఐగా పనిచేస్తున్నారు. ఉద్యోగ రీత్యా గతంలో వీరు వేర్వేరు జిల్లాల్లో పనిచేసినప్పటికీ నెలలో రెండుసార్లు తప్పనిసరిగా కలుస్తూ ఇరువురి కుటుంబ యోగక్షేమాలు తెలుసుకునేవారు. తాము ఎప్పుడు కలిసినా ఊరి గురించి, అక్కడి ప్రజల గురించి వాకబు చేస్తూ గంటల కొద్ది గడుపుతామని వారిద్దరు తెలిపారు. తమ స్నేహం చిరస్థాయిగా నిలిచిపోయేదని పేర్కొన్నారు.

స్నేహం ఊహకు అందని అంశం


మిత్రుడు అనిల్‌తో ఎమ్మెల్యే వేముల వీరేశం

స్నేహం అనేది ఊహకు అందని అంశం. మధురమైన జ్ఞాపకం. స్నేహానికి గుర్తే ఫ్రెండ్‌షిప్‌డే. ప్రస్తుత రోజుల్లో మానవ విలువలు, సంబంధాలు వ్యాపారమయంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ఫ్రెండ్‌షిప్‌డే గొప్పతనాన్ని చాటిచెప్పాలి. ఏ స్థాయిలో ఉన్నా తన స్నేహాన్ని మర్చిపోకుండా అక్కున చేర్చుకోవడమే నిజమైన స్నేహం. నా చిన్ననాటి స్నేహితుడు నల్లబెల్లి యాదగిరిది మోత్కూర్ మండలం గట్టు సింగారం. మా స్వగ్రామమైన శాలిగౌరారం మండలం ఊట్కూరు వాసి అనిల్ కూడా నా స్నేహితుడే. ఇంటర్‌లో న్యాయవాది ధర్మార్జున్‌తో కూడా స్నేహం చేశాను. ఆయన కూడా నాకు అండగా ఉండేవాడు.

– వేముల వీరేశం, ఎమ్మెల్యే నకిరేకల్

లా కాలేజీలో స్నేహితులయ్యారు


భాస్కర్‌రావు, వెంకటరమణ

సాక్షి, యాదాద్రి: ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో ఇద్దరి వ్యక్తుల మధ్య చిగురించిన స్నేహం 35 ఏళ్లుగా కొనసాగుతోంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన ఏపూరి భాస్కర్ రావు, హైదరాబాద్‌కు చెందిన టీ. వెంకటరమణ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో 1991 జూలై 12న ఒకే రోజు చేరారు. ఆనాడు వారి మధ్యన ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. భాస్కర్‌రావు ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షలు రాసి రెవెన్యూ శాఖలో చేరారు. ప్రస్తుతం సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. వెంకటరమణ న్యాయవాదిగా హైదరాబాద్‌లోని తార్నాకలో స్థిరపడ్డారు. భాస్కర్‌రావు ఉన్నత ఉద్యోగంలో ఉన్నప్పటికీ తన స్నేహితుడు వెంకటరమణకు అవసరమైన చోట అండగా ఉంటూ వస్తున్నారు. ఇద్దరం విధి నిర్వహణలో రాష్ట్రంలో ఎక్కడ పనిచేసినా వారానికి రెండు మూడుసార్లు ఫోన్‌లో మాట్లాడుకుంటామని భాస్కర్‌రావు తెలిపారు.

ఉద్యోగ సాధనలోనూ కలిసికట్టుగా..


లాలు, కరుణాకర్

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చివ్వెంల మండలం గుడిరాంతండా ఆవాసం హలావత్‌తండాకు చెందిన లాలు 2001–2003 విద్యాసంవత్సరంలో సూర్యాపేటలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో నకిరేకల్ మండలం చెరువు మాదారం గ్రామానికి చెందిన నర్సింగ్ కరుణాకర్‌తో స్నేహం ఏర్పడింది. కళాశాలలో ప్రారంభమైన వీరి స్నేహం ఉద్యోగ సాధనలోనూ కొనసాగింది. 2006లో ఇద్దరు డీఎస్సీ రాయగా ఇద్దరికి ఎస్‌జీటీలు ఉద్యోగాలు రావడంతో టీచర్లుగా పనిచేశారు. అనంతరం 2016లో ఇద్దరు కలిసి గ్రూప్–2 పరీక్షలు రాయగా ఇద్దరూ డిప్యూటీ తహసీల్దార్లుగా ఎంపికయ్యారు. నర్సింగ్ కరుణాకర్ ప్రస్తుతం గద్వాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తుండడంతో సమయం కుదరక రెండు నెలలకోసారి కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు.

స్నేహానికి అరవై వసంతాలు


మంత్రి ప్రగడ భరతరావు- శ్రీరామకవచం వెంకటేశ్వర్లు

కోదాడ : మంత్రిప్రగడ భరతరావు, శ్రీరామవచం వెంకటేశ్వర్లు ఇద్దరూ ఆరు దశాబ్దాలుగా కలిసి నడుస్తూ స్నేహమంటే ఇదేరా అన్నట్లు ఉంటున్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలోని లకారం గ్రామానికి చెందిన భరతరావు, పక్కన గ్రామమైన లింగగిరికి చెందిన శ్రీరామకవచం వెంకటేశ్వర్లు 1968లో కోదాడ కేఆర్‌ఆర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న కాలం నుంచి స్నేహితులుగా కొనసాగుతున్నారు. ఇద్దరు అదే కళాశాల నుంచి ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత ఇద్దరు మరో 15 సంవత్సరాలు కోదాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పనిచేశారు. ఇటీవలే వారు ఆ ఉద్యోగాలనూ మానేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇన్ని సంవత్సరాలు మీరు ఇంత స్నేహంగా ఉండడానికి కారణమేంటని ఎవరైనా.. అడిగితే అది వారి గొప్పతనమే.. అటూ ఒకరి గురించి ఒకరు కితాబునిచ్చుకుంటారే తప్పా నేనే అనిమాత్రం చెప్పుకోరు. పరస్పర గౌరవం ఇచ్చిపుచ్చుకోవడమే స్నేమబంధం పదికాలాలపాటు నిలిచి ఉండడానికి పునాది అని వారు ఎప్పుడూ చెపుతుంటారు.

రాజకీయ రంగు అంటని స్నేహ బంధం


బొల్లం బాలయ్య, శేషరాజు భిక్షమయ్య (తెల్ల గడ్డం వ్యక్తి)

నిడమనూరు: నిడమనూరు మండల కేంద్రానికి చెందిన బొల్లం బాలయ్య, శేషరాజు భిక్షమయ్య వయస్సు 70సంవత్సరాల పైనే ఉంటుంది. బొల్లం బాలయ్య యాదవ సామాజిక వర్గంలో పెద్ద రైతుగా, పెద్దమనిషిగా గుర్తింపు పొందారు. శేషరాజు భిక్షమయ్య రాజకీయాలతో పాటు వ్యాపారం, వ్యవసాయం చేస్తున్నారు. చిన్ననాటి నుంచి స్నేహితులైన వీరిద్దరు ఎన్నో పర్యాయాలు గ్రామ సమస్యలతో పాటు సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. నిడమనూరు సర్పంచ్‌గా 2007లో వీరిద్దరితో పాటు మరికొందరు పోటీపడగా.. బొల్లం బాలయ్య 95 ఓట్లతో నిడమనూరు సర్పంచ్‌గా గెలుపొందారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థులుగా పోటీ పడినప్పటికీ ఎన్నికల అనంతరం కొన్నిరోజులకే వారు తిరిగి తమ స్నేహాన్ని కొనసాగించారు. ఇప్పటికీ వారిద్దరు ప్రతినిత్యం ఆరోగ్యం, వ్యవసాయం, రాజకీయాల గురించి చర్చిస్తుంటారు.

ఎమ్మెల్యే అయినా.. స్నేహాన్ని మరువలే..!


మిత్రుడు గాదరి కిషోర్‌తో జంపాల రాజు


గుండాల: గురుకుల పాఠశాలలో ఏర్పడిన స్నేహం నేటికీ కొనసాగుతోంది. వారిలో ఒకరు ఎమ్మెల్యే కాగా.. మరొకరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయ్యారు. గుండాల మండలం మోత్కూరు గ్రామానికి చెందిన జంపాల రాజు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ 30 ఏళ్ల క్రితం సర్వేల్ గురుకులంలో స్నేహితులయ్యారు. నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఒకరు ఎమ్మెల్యే కాగా మరొకరు, ప్రధానోపాధ్యాయుడు. గాదరి కిషోర్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ తన మిత్రుడు రాజు కుటుంబాలతో స్నేహంగా ఉండేవారు. నాటి నుంచి నేటి వరకు తన స్నేహం అలాగే కొనసాగుతోంది.

ఆటోను ఢీకొట్టిన లారీ.. పలువురికి గాయాలు


చిన్నారి దీక్షితకు వైద్యం అందిస్తున్న వైద్యురాలు

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ హైవేపై చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శనివారం రాత్రి ఆటోను లారీ ఢీకొట్టడంతో ఆటోలోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం మొల్కచెర్ల గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆంజనేయులు, భార్గవి, వెంకటయ్య, అంజి, శ్రీకాంత్, రేణుక, మొగులమ్మ, త్రివేణితో పాటు వారి పిల్లలు మొత్తం 14మంది కలిసి శనివారం సాయంత్రం ఆటోలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో రాత్రి 9గంటల సమయంలో చౌటుప్పల్ పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వెనుక నుంచి అతివేగంగా లారీ వచ్చి ఆటోను ఢీకొని ముందుకు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారందరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో ముందు సీట్లో తండ్రితో కలిసి కూర్చున్న దీక్షిత(5)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె తల వెనుక భాగం పగిలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

పెన్‌పహాడ్: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం మేగ్యాతండా ఆవాసం కేవ్లాతండాకు చెందిన లకావత్ లఘుపతి ఇంటికి గత నెల 28న తాళం వేసి ఉండగా.. చివ్వెంల మండలం తుల్జారావుపేటకు చెందిన ధరావత్ మణిరామ్ గడ్డపారతో తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి తులం బంగారం, రూ.5వేల నగదు అపహరించాడు. బాధితుడు లఘుపతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపికృష్ణ కేసు నమోదు చేయగా.. దర్యాప్తులో భాగంగా క్లూస్‌టీం సహాయంతో చోరీకి పాల్పడిన మణిరామ్‌ను పట్టుకొని అతడి వద్ద నుంచి సొత్తుని రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా సిమెంట్ విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

చివ్వెంల(సూర్యాపేట): నకిలీ పేర్లతో సిమెంట్ బ్యాగులు తయారు చేసి అక్రమంగా సిమెంట్ విక్రయిస్తున్న నలుగురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం ఇమాంపేటకు చెందిన పోలోజు ఉపేంద్రచారి, మునగాల మండలం బరాఖత్‌గూడేనికి చెందిన ఎస్‌కే బాబు సిమెంట్ కంపెనీల్లో లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. దురాజ్‌పల్లిలో సిమెంట్ షాపు నిర్వహిస్తున్న వలిగొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన కావేటి రాజు వారి వద్ద సిమెంట్, నార్కట్‌పల్లికి చెందిన బండి వెంకటరమణ వద్ద బ్యాగులు కొనుగోలు చేసి వివిధ సిమెంట్ కంపెనీల పేర్లను ముద్రించి సిమెంట్ నింపి విక్రయించేవాడు. రాజు నిర్వహిస్తున్న షాపుపై శనివారం పోలీసులు దాడి చేసి 980 సిమెంట్ బ్యాగులు, 30 ఖాళీ బ్యాగులు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చెట్టును ఢీకొట్టిన లారీ.. డ్రైవర్ మృతి


లారీ ఢీకొనడంతో కూలిన వేప చెట్టు (ఇన్‌సెట్‌లో) లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గావున్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ జాబోరే సుగుణాకర్(26) లారీలో బొగ్గు లోడుతో ఆసిఫాబాద్ నుంచి ఏపీలోఇన మాచర్లకు వెళ్తున్నాడు. శనివారం తెల్లవారుజామున సుమారు 4.20గంటలకు లారీ ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలోకి రాగానే డ్రైవర్‌కు నిద్రరావడంతో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన వేప చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుగుణాకర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. క్లీనర్ వెంకటేశ్ బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం వారు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను లారీ క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి 108 వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లారీ వేగంగా ఢీకొనడంతో భారీ వేప చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. చెట్టు లేకపోతే పక్కనే ఉన్న ఇళ్లలోకి లారీ దూసుకెళ్లి ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ దస్తగిరి తెలిపారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగల రిమాండ్

- 12 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి: డూప్లికేట్ తాళంచెవిలు ఉపయోగిస్తూ బైక్‌లు చోరీ చేస్తున్న దొంగలను నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఈ కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శనివారం నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. గతేడాది నవంబర్ 3వ తేదీన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పైన కేతేపల్లి మండలం ఇనుపముల గ్రామానికి చెందిన తిరుగుడు సతీష్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సతీష్ ఫిర్యాదు మేరకు నార్కట్‌పల్లి పోలీసు కేసు నమోదు చేశారు. శనివారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని అమ్మనబోలు చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు రామన్నపేట మండలం ఎయన్నారం గ్రామానికి చెందిన మట్టిపల్లి వెంకన్న, మట్టిపల్లి అనిల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. వారు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ తాళంచెవిలు ఉపయోగించి బైక్‌లు చోరీ చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరు తెలుగు రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు యన్నారం గ్రామానికే చెందిన మట్టిపల్లి శ్రీకాంత్ కూడా ఈ చోరీల్లో పాలుపంచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. శ్రీకాంత్ ప్రస్తుతం ఏపీలోని పిడుగురాళ్లలో నివాసముంటుండగా.. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.